సాక్షి ఒడిశా
శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3.32.274లు, బంగారం 4 గ్రాము 970 మిల్లీగ్రాము, వెండి 170 గ్రాముల 480 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రాగల 12 గంటలలో..

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఇది వాయుగుండంగా మారే అవకాశం ఉందని చెప్పారు.

-10లో



సంక్షేమ పథకాలపై అవగాహన

బాబాసాహెబ్ కల్యాణ మండప ప్రాంగణంలో లోక కల్యాణ సచేతన మేళా నిర్వహించారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

-10లో

న్యూస్‌రీల్

ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల పార్క్‌కు స్థల పరిశీలన



స్థల పరిశీలనలో కలెక్టర్ తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి తాలసింగి గ్రామం వద్ద 16 కొత్త సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు రానున్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ మధుమిత, సబ్ కలెక్టర్ అనుప్ పండా, తహసీల్దార్లు నారాయణ బెహరా, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులు ఆ ప్రాంతంలో గురువారం ఉదయం పర్యటించి స్థల పరిశీలన చేశారు. తాలసింగి గ్రామస్తులు ఎం.ఎస్.ఎం.ఈ పరిశ్రమల పార్క్ పార్కును వ్యతిరేకిస్తూ తమ భూములను ఇవ్వబోమని అధికారులుకు చెప్పడంతో అధికారులు స్పందించారు. జిల్లా అధికారులు గ్రామస్తులతో సమీక్షించారు. దీనిపై ఏడు రోజుల్లోగా ఇండస్ట్రీయల్ పార్కుపై నివేదిక ఇవ్వాల్సిందిగా కలెక్టర్ మధుమిత తహసీల్దార్లు, కలెక్టర్, బీడీవోలను ఆదేశించారు.

తప్పిన వరద ముప్పు



ఉప్పొంగుతున్న హీరాకుడ్ జలాశయం

భువనేశ్వర్: హిరాకుద్ ఆనకట్ట 20 గేట్లు తెరిచి వరద నీటిని విడుదల చేస్తున్నారు. నీటి మట్టం పెరుగుదల అనుగుణంగా గేట్లు తెరుస్తున్నారు. ప్రస్తుతం ఎడమ వైపున 13 గేట్లు, కుడి వైపున 7 గేట్లు తెరిచి ఉన్నాయి. హిరాకుద్ జలాశయం నీటి మట్టం 629.21 అడుగులు, జలాశయంలోనికి సుమారు 6 లక్షల క్యూసెక్కుల నీరు చేరింది. 2 లక్షల 97 వేల 737 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మహా నది ఎగువ భాగంలో భారీ వర్షంతో హీరాకుద్ జలాశయం నీటి మట్టం గణనీయంగా పెరుగుతుంది. నీటి నిల్వ నిర్వహణలో భాగంగా వరద నీరు విడుదల చేస్తున్నట్లు జల వనరుల శాఖ ఇంజినీరు ఇన్ చీఫ్ చంద్రశేఖర పాఢి తెలిపారు. లోతట్టు మహానది ఉప నదులు కువాఖాయి, కఠాజోడి, దయా, భార్గవి, దేవీ తదితర ఉప నదుల్లో నీటి మట్టం సాధారణంగా కొనసాగుతోంది. ఆయా తీర ప్రాంతాల్లో వర్షం నామమాత్రంగా ఉన్నందున హీరాకుద్ జలాశయం నీటి విడుదలతో లోతట్టు నదీ తీరాల్లో వరద ముంపు పరిస్థితి ఉండబోదని చంద్ర శేఖర పాఢి అభయమిచ్చారు.

పూరీ జైలులో ఖైదీ ఆత్మహత్య

భువనేశ్వర్: పూరీ జిల్లా జైలులో ఖైదీ ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర కలకలం రేపింది. తువ్వాలుతో ఉరి వేసుకున్నట్లు భావిస్తున్నారు. మృతుడు పిప్పిలి గ్రామానికి చెందిన బుల్లా బెహెరాగా గుర్తించారు. పోక్సో కేసులో నిందితుడైన ఇతను జూలై నుంచి జైలులో ఉన్నాడు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- రూ. 2 లక్షల స్వాధీనం



కేసు వివరాలను నిందితుడి సమక్షంలో వివరిస్తున్న పోలీసులు

రాయగడ: స్కూటీ డిక్కీలో మూడు లక్షల రూపాయల చోరీ కేసుకు సంబంధించి జిల్లాలోని గునుపూర్ ఆదర్శ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రెండు లక్షల రూపాయల నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వ్యక్తి గంజాం జిల్లాలోని అస్కా పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఎ.అజానరావుగా గుర్తించారు. కేసుకు సంబంధించి ఐఐసీ కేకేబీకే కుహోరా బుధవారం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల తొమ్మిదో తేదీన గుణుపూర్‌లో నివసిస్తున్న రమాకాంత మహాపాత్రో ఇండియన్ బ్యాంక్‌లో తన ఖాతా నుంచి మూడు లక్షల రూపాయలను విత్‌డ్రా చేసి ఆ మొత్తాన్ని స్కూటీ డిక్కీలో పెట్టాడు. మార్కెట్‌లో అతనికి అవసమయ్యే వస్తువులను ఖరీదు చేసేందుకు బెబర్తా వీధిలోకి వెళ్లాడు. సామాన్లు ఖరీదు చేసి తిరిగి వచ్చిచూసేసరికి స్కూటీ డిక్కీ తెరిచి ఉండటంతోపాటు అందులో ఉంచిన మూడు లక్షల రూపాయలు లేకపోవడంతో బాధితుడు గుణుపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

పరిశుభ్రతలో..
ప్రథమ స్థానం సాధించాలి



భువనేశ్వర్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న సీఎం మోహన్ చరణ్ మాఝి



భువనేశ్వర్: రోడ్డుపై చెత్త తొలగిస్తున్న ముఖ్యమంత్రి

- స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి
- లింగరాజ్ ఆలయ పరిసరాల్లో చెత్త తొలగింపు

భువనేశ్వర్: పరిశుభ్రత, స్వచ్ఛత రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పిలుపునిచ్చారు. నిత్యం గంటపాటు పరిసరాల పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహిస్తే స్వచ్ఛమైన పర్యావరణం మన సొంతం అవుతుందన్నారు. స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా–2025 ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లింగరాజ్ ఆలయ భజన మండపం పరిసరాల్లో వీధుల్ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. సీఎంతో పాటు నగర మేయర్ సులోచన దాస్, గృహనిర్మాణం, నగరాభివృద్ధి విభాగం మంత్రి డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్రో, ఏకామ్ర నియోజకవర్గ ఎమ్మెల్యే బాబూసింగ్, నగర పాలక సంస్థ కమిషనర్ చంచల్ రాణా, సలహా కమిటీ చైర్మన్ బిరంచి నారాయణ్ మహాసూపకర్, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: పురపాలక సంఘం కార్యాలయంలో గురువారం స్వచ్ఛ ఉత్సవ్ నిర్వహించారు. ఏక్‌దిన్ ఏక్ గంటా, ఏక్ సాథ్ అనే నినాదంతో పర్లాకిమిడి పురపాలక సంఘం చైర్మన్ నిర్మలా శెఠి, వైస్ చైర్మన్ లెంక మధు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లక్ష్మణ ముర్ము, కౌన్సిలర్లు బాలకృష్ణ పాత్రో, బబునా బెహరా, ఇతర మున్సిపల్ సిబ్బంది కార్యాలయం ఆవరణతో ఉదయం చెత్తను ఊడ్చి చల్లారు.

జయపురం: జయపురం మునిసిపాలిటీలో గురువారం ఉదయం స్వచ్ఛతా హీ సేవ–2025 కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయ క్రీడా మైదానంలో జయపురం సబ్‌కలక్టర్, మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కుమారి అక్కవరం శౌశ్యా రెడ్డి సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. పలు పాఠశాలల, కళాశాలలు, విశ్వ విద్యాలయ విద్యార్థులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: పురపాలక కార్యాలయ ఆవరణతో చెత్త ఊడుస్తున్న చైర్మన్ నిర్మలా శెఠి



జయపురం: మెయిన్ రోడ్డులో సైకిల్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్, చైర్మన్

కారు ఢీకొని వృద్ధుడు మృతి



ప్రమాద స్థలంలో ముకుందో మాల్లి



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మాత్తిలి సమితి నాయకగూడ పంచాయతీ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. నాయకగూడ పంచాయతీ సిరాగొడిగూడ గ్రామానికి చెందిన ముకుందో మాల్లి (63) వ్యక్తిగత పనిపై వెళ్లి తిరిగి వస్తుండగా మల్కన్‌గిరికి చెందిన ఓ కాంట్రాక్టర్ కారులో జయపూర్ వెళ్తు.. మాల్లిని వేగంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఆయన్ని స్థానికులు మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగున వైద్యం కోసం మల్కనగిరి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ముకుందో మాల్లి మృతి చెందాడు. మాత్తిలి పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశం మల్కన్‌గిరి టౌన్ పరిధికి రావడంతో సంబంధిత పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్టు మాత్తిలి ఐఐసీ దీపాం జాలీ ప్రదన్ తెలిపారు.

వలలో శివపార్వతుల విగ్రహం



భువనేశ్వర్: చేపల కోసం పన్నిన వలలో అరుదైన అష్ట ధాతు శివపార్వతుల విగ్రహం చిక్కింది. దీని బరువు 30 కిలోలు పైబడి ఉంది. రెండు అడుగుల పీఠంపై రెండు విగ్రహాలను అమర్చినట్లు ఉన్న ఈ విగ్రహంపై బాబా బణాంబరేశ్వర్ అని రాసి ఉన్నట్లు గుర్తించారు. పూరీ జిల్లాలో గురువారం ఈ ఘటన వెలుగు చూసింది. మత్స్యకారుని సమాచారం మేరకు స్థానిక పోలీసులు విగ్రహం స్వాధీనం చేసుకున్నారు. పూరీ – కోణార్క్ ప్రధాన రహదారి పక్కన ప్రవహిస్తున్న నువా నొయి వంతెన కింద చేపలు పట్టేందుకు పన్నిన వలలో అరుదైన ఈ విగ్రహం లభించింది.

అమ్మో.. మొసలి!



టిట్లాగడ్ ఉందేర్ నది ఒడ్డున రెండు మొసళ్లు స్థానికులను బెంబేలెత్తించాయి. సుగ్నభట, సిలువా గ్రామం సమీపంలో మొసళ్లు కనిపించడంతో స్థానికులు వెంటనే అటవీ శాఖకు సమాచారం అందించారు.

- భువనేశ్వర్

చోరీ కేసులో ముగ్గురికి రెండేళ్ల జైలు

రాయగడ: స్థానిక ఎస్‌డీజేఎం వర్షాదాస్ బైకు కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులకు రెండేళ్ల జైలు శిక్షను విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. దీనితో పాటు రూ. పది వేల చొప్పున జరిమానా చెల్లించాలని.. చెల్లించలేని పక్షంలో మరో ఆరు మాసాలు జైలు శిక్షను అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి పదో తేదీన పట్టణంలోని రాణిగుడఫారంలో నివసిస్తున్న సంతోష్ మినియాక తన ఇంటి ముందు బైక్ ఉంచగా చోరీకి గురయ్యింది. దీనిపై బాధితుడు సదరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అర్జు పిడిక, సహదేవ్ మండంగి, బిజయ్ మండంగిలను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసు గురువారం విచారణకు రాగా ఎస్‌డిజేఎం దాస్ పది మంది సాక్షులను విచారించిన తరువాత తన తుది తీర్పును వెల్లడించారు.

డ్యాంలో మునిగిపోయిన కంటైనర్



ఆయిల్ ట్యాంకర్ కోసం డ్యాంలో వెతుకుతున్న ఓడ్రాఫ్ సిబ్బంది



అడవ వద్ద హారభంగి డ్యాం

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనాబ్లాక్ అడవ పోలీస్‌స్టేషన్ పరిధిలో అడ్డపంక వద్ద ఆయిల్‌తో వెళ్తున్న కంటైనర్ వాహనం హారభంగి డ్యాంలో మునిగిపోయిందని అడవ ఎస్సై పంకజ్ దాస్ తెలిపారు. బుధవారం రాత్రి పది గంటల సమయంలో రాయగడ (జేకే) నుంచి బరంపురం వెళ్తున్న కంటైనర్ వాహనం అదుపుతప్పి హారభంగి డ్యాంలో మునిగిపోయింది. అయితే డ్రైవర్ సంజీవ్ యాదవ్ చాకచక్యంగా తప్పించుకుని ఒడ్డుకు చేరాడు. అడవ పోలీసులతో కలిసి డ్యాంలో పడిపోయిన అయిల్ కంటైనర్ తీసేందుకు గురువారం ఉదయం నుంచి ఓడ్రాఫ్, అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇంతవరకూ కంటైనర్ బయటపడలేదు. డ్యాంలో నీరు ఎక్కువగా ఉండడం వల్ల కంటైనర్ బయటకు తీయడానికి లిఫ్టు యంత్రాలు తేనున్నట్టు పోలీసు అధికారులు చెబుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి

- చెట్టును టిప్పర్ ఢీకున్న ఘటనలో ఇద్దరు, ద్విచక్ర వాహనాలు ఢీకొని మరో ఇద్దరు దుర్మరణం
- ఐదుగురికి తీవ్ర గాయాలు
- రాయగడ, కొరాపుట్ జిల్లాల్లో ఘటనలు



రాయగడ: చెట్టును ఢీకొన్న టిప్పర్



టిప్పర్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీస్తున్న దృశ్యం

రాయగడ: అదుపుతప్పిన ఒక టిప్పర్ చెట్టుకు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన రాయగడ జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి బాలేరికుడియా ప్రధాన రహదారి వద్ద గురువారం చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో రామనగుడ సమితి అర్జునగుడ గ్రామానికి చెందిన అలిక్షి పిడిక (21), అజయ్ పాలక (19)లు మృతి చెందగా టిప్పర్ డ్రైవర్ రామమూర్తి పిడిక తీవ్రగాయాలకు గురై గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అతన్ని బరంపురం ఆస్పత్రికి రిఫర్ చేశారు. గురువారం ఉదయం గుమడ నుంచి ఇసుక లోడ్ తీసుకువచ్చి అన్‌లోడ్ చేసిన అనంతరం తిరిగి వెళుతున్న సమయంలో బాలేరికుడియా వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో టిప్పర్ ముందుభాగం నుజ్జు నుజ్జవ్వగా అందులోని డ్రైవర్ రామమూర్తి గాయాలతో బయటపడగా అలిక్షి, అజయ్‌లు మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న గుణుపూర్ ఆదర్శ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని టిప్పర్‌లో ఇరుక్కుపొయిన ఇద్దరి మృదేహాలను బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు పోలీసులు వెల్లడిచారు.

ఎదురెదురుగా బైకులు ఢీకొని..

కొరాపుట్: శరవేగంతో వెళ్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. గురువారం వేకువజామున కొరాపుట్ జిల్లా నారాయణ పట్న సమితి కేంద్రంలో మెయిన్ రోడ్డు మీద పెట్రోల్ బంక్ ఎదురుగా ఈ ప్రమాదం జరిగింది. ఒక బైక్ మీద సమీప గదబగుడ కి చెందిన అభిమిసికా (23), శరత్ మండగి (25), మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వెళ్తున్నారు. అదే సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు ఒక బైక్ మీద ఎదురుగా వస్తూ బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురూ తీవ్ర గాయాలతో కిందపడిపోయారు. వాహనాలు ఢీకొనిన శబ్దానికి స్థానికులు మేల్గొని సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా అంబులెన్స్ అక్కడికి చేరుకుంది. అప్పటికే అభిమిసికా, శరత్ మండగి మృతి చెందారు. మిగిలిన నలుగురిని కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలకు తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమించడంతో బ్రహ్మపుర్‌లోని వైద్య కళాశాలకు తరలించారు. క్షతగాత్రులైన నలుగురి పరిస్థితి విషమం గానే ఉందని వైద్యులు ప్రకటించారు. మరో వైపు మృతుల బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకు దిగారు. తమకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని బాధిత బంధువులతో చర్చలు జరిపి ఆందోళనను విరమింపజేయించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.



అలిక్షి, అజయ్ (ఫైల్)



కొరాపుట్: క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



కొరాపుట్:ప్రమాద దృశ్యం



కొరాపుట్: సంఘటన స్థలంలో మృతదేహాలు

క్లుప్తంగా

27న సోటెట్

పర్లాకిమిడి: జూలై 19వ తేదీన ఓటెట్ పరీక్ష పేపరు లీక్ కావడం వల్ల ఒడిశా టీచర్స్ అర్హత రాత పరీక్షలు (ఓటెట్) వాయిదా పడింది. ఈ నెల 27వ తేదీ గజపతి జిల్లా పర్లాకిమిడిలో ఐదు కేంద్రాల్లో స్పెషల్ టీచర్స్ అర్హత రాత పరీక్ష (సోటెట్)ను నిర్వహించనున్నారు. మొదటి షిఫ్ట్ ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయనని జిల్లా ముఖ్య విద్యాధికారి మయాధర్ సాహు తెలియజేశారు. ఈ టీచర్స్ ఎలిజిబిలిటీ రాత పరీక్షకు 1547 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. హాల్ టిక్కెట్లును సంబంధిత వెబ్ సైట్లో డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు.

9 మంది జూదరుల అరెస్టు

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితి ఘోర్ని పంచాయతీ ఎస్.ఘోర్ని గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న జూదం శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేసి 9 మందిని అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.లక్షా 67 వేలను స్వాధీనం చేసుకున్నట్టు గురండి పోలీసు స్టేషన్ ఐఐసీ ఓం నారాయణ పాత్రో తెలియజేశారు.

ఘనంగా దీన దయాళ్ జయంతి



దీన్ దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పర్లాకిమిడి: స్థానిక ఇరదల వీధిలో గల బీజేపీ కార్యాలయంలో గురువారం దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నబకిశోరో శోబోరో, మహిళా మోర్చా అధ్యక్షురాలు అరుణిమా సాహు, రాజ్యలక్ష్మి, సాధారణ కార్యదర్శి ఈ.ప్రశాంత్, జగన్నాథ మహాపాత్రో, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఆకస్మిక దాడులు



బొడ్డేపల్లి వద్ద ఇసుక ర్యాంపులో పర్యటిస్తున్న అధికారులు



పోలీస్‌స్టేషన్ వద్ద సీజ్ చేసిన వాహనాలు

పొందూరు: పొందూరు మండలంలో నిర్వహిస్తున్న అక్రమ ఇసుక ర్యాంపులు, ఇసుక డంపింగ్‌లపై బుధవారం అధికారులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు చేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు బొడ్డేపల్లిలో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు, సింగూరు కూడలి నుంచి బొడ్డేపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇసుక నిల్వలను పరిశీలించారు. ఈ సమయంలో ఇసుక లోడుతో ఉన్న మూడు భారీ టిప్పర్లు, 4 జేసీబీలు, ఒక ట్రాలీ, 10 ట్రాక్టర్లను పట్టుకున్నారు. బొడ్డేపల్లి ర్యాంపులోనూ ఇసుక నిల్వల వద్ద టిప్పర్లు, లారీల్లోకి ఇసుకను డంప్ చేస్తున్న సమయంలో జేసీబీలను స్వాధీనం చేసుకు న్నారు. ఈ సందర్భంగా ర్యాంపు నిర్వాహకుల గురించి వాహన డ్రైవర్లను ప్రశ్నించారు. అయితే తాము కేవలం ఇసుకను మాత్రమే తీసుకెళ్తామని, లావాదేవీలన్నీ తమ వాహన ఓనర్లే చూసుకుంటున్నారని డ్రైవర్లు తెలిపారు. ఇసుక ర్యాంపుల వద్ద, ఇసుక డంపింగ్ కేంద్రాల వద్ద ఉన్న రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

గార: మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో యువకుడు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని రెల్లివీధికి చెందిన అలిగి కిరణ్ (21), శరత్‌లు కళింగపట్నంలో ఒక శుభ కార్యానికి వెళ్లి సా యంత్రం బైక్‌పై తిరిగి వస్తున్నారు. అయితే వమరవల్లి జంక్షన్ సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో కిరణ్‌కు తీవ్రగాయాలు కాగా, శరత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనం ద్వారా శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా కిరణ్ మృతి చెందాడు.

మహిళలకు జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ : జిల్లా కేంద్రంలో బలగ హాస్పిటల్ జంక్షన్‌లో ఉన్న పారిశ్రామిక శిక్షణా సంస్థ/డీఎల్‌టీసీ వద్ద ఈ నెల 27న మహిళలకు జాబ్‌మేళా జరగనుందని అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహనరావు గురువారం తెలిపారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్‌లో టీపీఎస్ఎల్ ఏరోస్ట్రక్చర్స్, ఏరో ఇంజినీస్ సంస్థ పేరిట ఫీమేయిల్ ట్రెయినీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన కనీసం పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన ధ్రువపత్రాలతో శనివారం ఉదయం 9 గంటలకు డీఎల్‌టీసీ ప్రాంగణం వద్దకు చేరుకోవాలని సూచించారు.

రాగల 12 గంటల్లో..

- బంగాళాఖాతంలో అల్పపీడనం
- వాయుగుండంగా మారే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అధికారులు

భువనేశ్వర్: రానున్న 12 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనిలో భాగంగా శుక్రవారం సాయంత్రం నాటికి అల్ప పీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం ఉదయం నాటికి దక్షిణ ఒడిశా, ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటవచ్చు. దీని ప్రభావంతో కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. బంగాళాఖాతంలో అల్పపీడన హెచ్చరికల దృష్ట్యా ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) సత్యవ్రత సాహు గురువారం 18 జిల్లాలు నవరంగపూర్, కొరాపుట్, మల్కన్‌గిరి, రాయగడ, గజపతి, కలహండి, కంధమల్, కోస్తా ప్రాంతం గంజాం, నయాగఢ్, పూరీ, ఖుర్దా, జగత్ సింగ్ పూర్, కటక్, కేంద్రాపడా, జాజ్ పూర్, భద్రక్, బాలాసోర్, నువాపడా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర జల వనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్, స్థానిక వాతావరణ శాఖ డైరెక్టర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

- వాయుగుండంతో రాష్ట్రంలో 18 జిల్లాలు ప్రభావితమయ్యే పరిస్థితుల దృష్ట్యా అధికారులు తాజా వాతావరణ మార్పులపై నిఘా ఉంచి అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్‌సీ హెచ్చరించారు. ముఖ్యంగా కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

అవసరమైన చోట అగ్నిమాపక దళాలు, ఒడ్రాఫ్ బృందాలను మోహరించాలన్నారు. సహాయక, పునరుద్ధరణ పరికరాలతో యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలన్నారు.

బాలింత మృతిపై ఆందోళన

- రిమ్స్ వైద్య సిబ్బందిపై కుటుంబ సభ్యుల ఆరోపణ
- అలికాం – బత్తిలి రహదారిపై నిరసన



అలికాం-బత్తిలి రహదారిపై ఆందోళన చేస్తున్న దృశ్యం



లోచన మృతదేహం

హిరమండలం: రిమ్స్ వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిదని ఎల్ఎన్‌పేట మండలంలోని స్కాట్‌పేట గ్రామస్తులు అలికాం – బత్తిలి ప్రధా న రహదారిపై మృతదేహంతో గురువారం నిరసన తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్ఎన్‌పేట మండలం స్కాట్‌పేట గ్రామానికి చెందిన తొగరాపు లోచన (21)ను నెలలు నిండడంతో ప్రసవం కోసం భర్త ఉదయ్‌కుమార్ ఈనెల 22వ తేదీన శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడున్న సిబ్బంది పెద్దగా పట్టించుకోలేదు. సుఖ ప్రసవం కోసం వేచి చూద్దామంటూ చెప్పుకొచ్చారు. ఆ మరుసటి రోజు మంగళవారం పురిటి నొప్పులు తీవ్రతరం కావడంతో అక్కడున్న వైద్యులు ఆపరేషన్ చేసి ప్రసవం చేశారు. లోచన ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే బుధవారం నాటికి ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కేజీహెచ్‌కు తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని నేరుగా స్వగ్రామం స్కాట్‌పేటకు బుధవారం రాత్రి తీసుకొచ్చారు. అయితే రిమ్స్ వైద్యుల నిర్లక్ష్యంతోనే లోచన చనిపోయిందంటూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తూ అలికాం-బత్తిలి రహదారిపై గురువారం మృతదేహంతో ఆందోళనకు దిగారు. సరుబుజ్జిలి ఎస్ఐ హైమావతి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులకు నచ్చజెప్పారు. పోస్టుమార్టంకు పంపితే అసలు విషయం తెలుస్తుందని చెప్పారు. కానీ కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. అనంతరం మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా మృతురాలి లోచనకు రెండేళ్ల కుమారుడు, భర్త ఉదయ్‌కుమార్ ఉన్నారు. పసికందును చూసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భార్య మోసం చేసిందని..

- కుమార్తెతో కలిసి గడ్డిమందు తాగిన తండ్రి
- చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి
- సంచాంలో గ్రామంలో విషాదం



సంతోష్ (ఫైల్)

రణస్థలం : భార్య మోసం చేసిందనే ఆవేదన తో కుమార్తెకు గడ్డిమందు తాగించి తాను కూ డా అదే గడ్డిమందు తాగిన ఓ తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన రణస్థ లం మండలం మండలం సంచాం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, జే.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంచాం గ్రామానికి చెందిన దుప్పాడ సంతోష్(35) అనే వ్యక్తికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య అనూకు ఇద్దరు కుమారులు, రెండో భార్య స్వాతికి ఒక కుమార్తె ఉన్నారు. సంతోష్ కారు డ్రైవింగ్ చేస్తూ రెండు ఇళ్లు తీసుకుని ఇద్దరు భార్యలతో పాటు విశాఖపట్నంలోనే నివాసం ఉంటున్నాడు. కుమార్తె హైమవతి శ్రీకాకుళం సమీపంలోని పెద్దపాడు గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. దసరా సెలవులు కావడంతో హైమవతిని ఈ నెల 20న తీసుకు రమ్మని రెండో భార్య స్వాతిని సంతోష్ పంపించాడు.

ఇన్‌స్టాగామ్‌లో ఫొటోలు..

స్వాతి విశాఖపట్నం నుంచి వస్తూ అప్పటికే సంచాంలో మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కలిగి ఉండడంతో అతని వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో వీరిద్దరూ కలిసిన ఫొటోలను ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేశాడు. స్వాతి అదే రోజు రాత్రి కుమార్తెతో కలిసి విశాఖలోని ఇంటికి వెళ్లినప్పటికే ఇన్‌స్టాలో ఫొటోలు చూసిన సంతోష్ ఆమెతో గొడవ పడ్డాడు. ఈ నెల 21న కుమార్తె హైమవతితో పాటు రెండో భార్య స్వాతితో కలిసి స్వాతి కన్నవారైన జీరుపాలెం గ్రామానికి వెళ్లి, అక్కడ పెద్దల సమక్షంలో అప్పగించి తిరిగి విశాఖపట్నం వెళ్లిపోయాడు. మరలా ఈ నెల 24న జీరుపాలెం వెళ్లి కుమార్తెను వెంటబెట్టుకుని తన స్వగ్రామం సంచాం వచ్చాడు. సంచాం కొండ సమీపంలోని తోటలో హైమవతికి గడ్డిమందు తాగించి, తానూ తాగి మేము చనిపోతున్నామని వీడియో కాల్ చేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. చావుబతుకుల మధ్య ఉన్న ఇద్దరినీ కుటుంబ సభ్యులు తొలుత రణస్థలం సీహెచ్‌సీ తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఇద్దరూ మృతి చెందారు. మృతుడి తండ్రి దుప్పాడ సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

క్రెడాయ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): స్థానిక ఒక ప్రైవేటు హోటల్‌లో శ్రీకాకుళం క్రెడాయ్–2025 నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. వైజాగ్ చాప్టర్ ప్రెసిడెంట్ అశోక్, స్టేట్ ప్రెసిడెంట్ బోయిన శ్రీనివాసరావు, స్టేట్ చైర్మన్ ముని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో శ్రీకాకుళం చాప్టర్ ప్రెసిడెంట్‌గా పొట్నూరు రమేష్ చక్రవర్తి, సెక్రటరీగా ఆదీప్ రెడ్డి, చైర్మన్‌గా బెండి నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లుగా దుంగ సుధాకర్, కో రాడ సత్యారావు, గంజి భీమారావు, డోల వంశీ బాలకృష్ణ, ట్రెజరర్‌గా పృథ్వీరాజ్, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ముని శ్రీనివాసరావు, యూత్ వింగ్ ప్రెసిడెంట్‌గా పూజారి బాలచందర్, సెక్రటరీగా ఎన్ని జగదీష్, వైస్ ప్రెసిడెంట్‌గా లీలామోహన్ కృష్ణ, జాయింట్ సెక్రటరీగా సంతోష్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

బిల్లు కట్టమంటే..లారీ ఎక్కించేశాడు..

కంచిలి : భోజనం బిల్లు చెల్లించాలని కోరిన హోటల్ యజమాని పట్ల ఓ లారీ డ్రైవర్ సైకోలా ప్రవర్తించాడు. లారీ ఎక్కించేసి దారుణంగా హతమార్చాడు. ఇదేంటని అడ్డుకున్న మరో వ్యక్తిని సైతం లారీతో తొక్కించి చంపేశాడు. ఈ ఘోరమైన ఘటన కంచిలి మండలం జలంత్రకోట గ్రామ కూడలి సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..

జాతీయ రహదారిపై సరుకులు రవాణా చేసే క్రమంలో జార్ఖండ్ నుంచి విశాఖపట్నంకు బయలుదేరిన కంటైనర్ లారీ బుధవారం రాత్రి కంచిలి మండలం జలంత్రకోట గ్రామ కూడలిలో జాతీయ రహదారి పక్కన దాబా హోటల్ వద్ద ఆగింది. డ్రైవర్ ఎబ్రార్ ఖాన్ భోజనం చేసి అక్కడే మద్యం తాగాడు. భోజనం బిల్లు రూ.200 చెల్లించాలని హోటల్ యజమాని ఎం.డి.అయూబ్(56) కోరగా అందుకు నిరాకరించాడు. గొడవపడి లారీ తీసుకొని వెళ్లిపోతుండగా యజమాని అడ్డుకున్నాడు. దీంతో అతన్ని ఢీకొట్టి పైనుంచి లారీ తీసుకెళ్లిపోయాడు. ఆ హోటల్‌కు రోజువారీ పాలు ఇచ్చి తిరిగి వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్న మధుపురం గ్రామానికి చెందిన పాల వ్యాపారి డొక్కర దండాసి(71) తాను నడుపుతున్న టీవీఎస్ ఎక్సెల్ వాహనంతో అడ్డుకున్నాడు. ఆయన్ను కూడా లారీతో తొక్కేసి పారిపోయాడు. ఈ ఘటనలో యజమాని, పాల వ్యాపారి అక్కడికక్కడే మృతిచెందారు. హోటల్ సిబ్బంది, స్థానికులు వెంబడించి బూరగాం వద్ద లారీని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మృతదేహాలకు సోంపేట ప్రభుత్వాసుపత్రిలో గురువారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు.

వలస కుటుంబంలో విషాదం..

హోటల్ యజమాని ఎం.డి. అయూబ్ పదిహేనేళ్ల జార్ఖండ్ రాష్ట్రం చత్‌గల్ జిల్లా సత్‌గాం నుంచి 15 ఏళ్ల కిందట వలస వచ్చాడు. భార్య నసీమా బేగం, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఈశ్వర తలియ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ



ఈశ్వర్ తలియ చిత్రపటం



ఈశ్వర్ తలియ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీడీఓ శక్తి మహాపాత్రో



కార్యక్రమంలో బీడీఓ, తదితరులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి వాసి సహిద్ జవాన్ ఈశ్వర తలియ విగ్రహం నిర్మించాలని ప్రజలు నిర్ణయించారు. గతేడాది డిసెంబర్ 24వ తేదీన ఈశ్వర తలియ మిలటరీ క్యాంపులో శిక్షణలో ఉన్న సమయంలో టాంకర్ పేలడంతో మృతి చెందారు. ఆదివాసీ యువకుడు దేశం కోసం ప్రాణాలు అర్పించి బొయిపరిగుడకే కాకుండా జిల్లాకే పేరు తెచ్చారన్నారు. ప్రజల హృదయాలలో చిరకాలం నిలిచి ఉండేందుకు అతడి విగ్రహం ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు నిర్ణయించారు. వారి నిర్ణయం మేరకు బుధవారం ఈశ్వర్ తలియ జన్మ భూమి కెంధుగుడ పంచాయతీ బొడొగుడ గ్రామంలో విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో బొయిపరిగుడ బీడీఓ బాధ్యతలు నిర్వహిస్తున్న జయపురం బీడీఓ శక్తి మహాపాత్రో భూమిపూజ చేశారు. సహిద్ ఈశ్వర విగ్రహం డిసంబర్ 24వ తేదీలోగా పూర్తి చేయాలని సమితి అధికారులును గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యులు రాజేశ్వర్, బొయిపరిగుడ సమితి చైర్మన్ ప్రశాంత కుమార్ గుప్త, వైస్ చైర్‌పర్సన్ పూర్ణిమ బారిక్, బొయిపరిగుడ పోలీసు అధికారి డొంబురుదొర బత్రిక, సామాజిక సురక్షా అధికారి కార్తీక పాడీ, స్థానిక న్యాయవాది విష్ణుజిత్ నాయక్‌తోపాటు పలువురు గ్రామ ప్రజలు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ చైర్మన్ దేవేంద్ర త్రిపాఠి

జయపురం: జయపురం మున్సిపాలిటీలోని బాబా సాహెబ్ కల్యాణ మండప ప్రాంగణంలో లోక కళ్యాణ సచేతన మేళా నిర్వహించారు. మున్సిపాలిటీ ద్వారా వివిధ ప్రభుత్వ విభాగాలు పీఎం సూర్యఘర్ మఫ్త్ బిజిలి యోజన, పీఎం స్వానిధి, ఆయుస్మాన్ భారత్, వందన యోజన, ఆహార భద్రతా చట్టం, లబ్ధిదారులకు బ్యాంక్ రుణాలు, ఫైనాన్స్ సౌకర్యాలు, డొమెస్టిక్ వాటర్ సప్లై, ఆధార అన్‌రోల్‌మెంట్ తదితర వాటిపై స్టాల్స్ ఏర్పాటు చేశారు. మేళాలో ప్రధాన మంత్రి అవాస్ మేళా, పీఎం స్వానిధి మేళా, లోక కళ్యాణ మేళా, పీఎంఏవై 2.0 పథకంలో అగ్నికార్ 2025 లబ్ధిదారులకు కలిగే ప్రయోజనాలను వక్తలు వివరించారు. జయపురం సబ్‌కలెక్టర్, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కుమారి అక్కవరం శౌశ్య రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ చైర్మన్ దేవేంద్ర త్రిపాఠీ లోక కళ్యాణ సచేతన మేళా లక్ష్యాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, మున్సిపాలిటీ అదనపు కార్యనిర్వాహక అధికారి పూజ రౌత్, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మాఫియా నిందితుడు అరెస్టు



పోలీసులకు చిక్కిన నిందితుడు కార్తీక లంబార్

జయపురం: గంజాయి దొంగతనంగా రవాణా చేస్తున్న కేసులో పరారైన నిందితుడు కార్తీక లంబార్‌ను జయపురం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. జూన్ నెల 29వ తేదీన బరిణిపుట్ గ్రామ సమీపంలో 26 జాతీయ రహదారిలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సమీపంలోని పాత గిడ్డంగిలో ఇద్దరు వ్యక్తులు పోలీసు వాహనాన్ని చూసి పరుగు తీశారు. పోలీసులకు అనుమానం వచ్చి గిడ్డంగిలోకి వెళ్లారు. అక్కడ మినీ ట్రక్కులోకి గంజాయి లోడ్ చేస్తూ కనిపించారు. పట్టణ పోలీసులు దాడి జరిపి 13 క్వింటాళ్ల 18 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో అక్కడ 10 మందికి పైగా వ్యక్తులు ఉండగా.. పోలీసులను చూసి అందరూ పరుగులు తీశారు. ఆ సంఘటనలో పోలీసులు నలుగురు నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు. ఈ సంఘటనలో మరో నిందితుడు కార్తీక లంబార్ పోలీసుల కన్ను గప్పి పరారయ్యాడని పట్టణ పోలీసు అధాకారి ఉల్లాష్ రౌత్ గురువారం వెల్లడించారు. నిందితుడు కార్తీక లంబార్ జయపురం వచ్చి పట్టణంలో తిరుగుతున్నట్లు సమాచారం అందింది. పోలీసులు బరిణిపుట్‌లో దాడి జరిపి బుధవారం అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

బైక్ దగ్ధం



కాలిపోతున్న బైక్



కాలిపోయిన ద్విచక్ర వాహనం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి పప్పులూర్ గ్రామం వద్ద గురువారం ఉదయం ద్విచక్ర వాహనం (పల్సర్) దగ్ధమైంది. చిత్రకొండ సమితి దోరగూడ పంచాయతీ ఆర్ఎస్‌సీ–6 గ్రామానికి చెందిన ధనుంజయ్ గోలరీ మరో ఇద్దరితో కలిసి కుర్మానూర్‌లో తెలిసిన వ్యక్తి చనిపోవడంతో అక్కడకు వెళ్తున్నారు. గ్రామం నుంచి 15 కిలోమీటర్ల దూరం వెళ్లే సరికి కాలుతున్న వాసన రావడంతో అనుమానంతో వెంటనే వాహనాన్ని నిలిపివేశారు. ఇంతలో బైక్ నుంచి మంటలు రావడాన్ని గమనించి సమీపంలో ఉన్న ఇసుక, నీరు పోసి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వాహనం కొని నాలుగేళ్లే అయిందని.. ఎందుకు ఇలా జరిగి తెలియదని వాహన యజమాని ధనుంజయ్ అన్నారు.





కొత్తమ్మతల్లి



అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తజనం

- కొత్తమ్మకు చల్లదనం..

మురిసిన భక్తజనం

మురిసిన కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు ● ముర్రాటలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 23 నుంచి ఆరంభమైన ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, హెలికాప్టర్ రైడ్ వంటి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివరి రోజున కమ్మకట్టు కుటుంబం ఇంటి వద్ద నుంచి అమ్మవారి జంగిడితో పాటు అధిక సంఖ్యలో మహిళలు ముర్రాటలు, ఘటాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. దారి పొడవునా కొత్తమ్మతల్లి నినాదాలతో కోటబొమ్మాళి, పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఊరేగింపులో పలువురు యువకులు కొట్లాటకు దిగారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని చెదరగొట్టారు. అనంతరం పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

–టెక్కలి

క్లుప్తంగా

వృద్ధురాలి మృతి

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామ పరిసరాల్లో నాగావళి నది ఒడ్డున గురువారం ఉదయం ఓ వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రావుపల్లి గ్రామానికి చెందిన నల్ల కాంతం దమయంతి(59) కొన్నేళ్లుగా మతిస్థిమితం లేకపోవడంతో రావుపల్లి, శివ్వాం గ్రామాల్లో ఉంటూ జీవనం సాగిస్తోంది. ఆమెకు భర్త, పిల్లలు లేకపోవడంతో ఒంటరిగానే ఉంటోంది. నాలుగు రోజుల నుంచి రావుపల్లిలో గాని, శివ్వాంలో గాని కనిపించకపోవడంతో మృతురాలి అన్నయ్య చంద్రరావు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మేరకు పోలీసులు గాలించి గురువారం శివ్వాం గ్రామపరిధిలో నాగావళి నది ఒడ్డున మృతదేహాన్ని గుర్తించారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి


ఈశ్వరరావు (ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని అరకు-విశాఖ జాతీయ రహదారిలో మల్లివీడు జంక్షన్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వనం ఈశ్వరరావు(57) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస మండలం చిన్నిపాలెం గ్రామానికి చెందిన ఈశ్వరరావు తన సమీప బంధువు ఎస్.రామకృష్ణతో కలిసి మండలంలోని లింగంపేట గ్రామంలో జరుగుతున్న పూజా కార్యక్రమానికి వెళ్తుండగా మల్లివీడు జంక్షన్ వద్దకు వచ్చేసరికి కుక్క అడ్డంగా రావడంతో బైక్ అదుపు తప్పి ఇద్దరూ పడిపోయారు. దీంతో బైక్ వెనుక కూర్చున్న ఈశ్వరరావు తీవ్ర గాయాలు పాలవగా విశాఖ కేజీహెచ్‌కు తరలించాచగా చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో యువకుడి గల్లంతు

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లికి చెందిన వర్రి మధు ఆ గ్రామ వెంగళరాయ సాగర్ చెరువులో గల్లంతైనట్లు తండ్రి దాడియ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో తాపీ పని చేసుకుని జీవించే తన మూడవ కుమారుడు చెరువులో స్నానం చేసి వస్తానని సైకిల్‌పై వెళ్లి తిరిగి రాలేదు. చివరకు వెతకగా చెరువు గట్టుపై కుమారుడి బట్టలు, సైకిల్ ఉన్నట్లు కుటుంబసభ్యులు గుర్తించి ఫిర్యాదు చేయగా ఏఎస్సై డి.కొండలరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీష్ కుమార్ తెలిపారు.

జీతాల బకాయి చెల్లింపునకు చర్యలు

పార్వతీపురం రూరల్: 'అమ్మను కాపాడే అతివకే గండం' అని బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఐటీడీఏ ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి స్పందించారు. గిరిజన గర్భిణుల వసతిగృహాల సిబ్బందికి బకాయి పడిన పదినెలల జీతాలను చెల్లించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు, అలాగే భవిష్యత్‌లో వసతిగృహాలకు పూర్తిస్థాయి పోస్టులు మంజూరైతే వారికే ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక


కలెక్టర్ రామసుందర రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న సెంచూరియన్ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్. రామసుందర రెడ్డిని మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయ ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ సందర్శనకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో చాన్సలర్ జీఎస్ఎన్‌రాజు, వీసీ పీకే మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.

లక్ష్యాలను చేరుకోవాలి

నెల్లిమర్ల: బీఎల్‌ఓలు ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని తహసీల్దార్ కె. శ్రీకాంత్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల విభాగం డీటీ వీవీఆర్ జగన్నాథం ఆధ్వర్యంలో బీఎల్‌ఓలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పాత, కొత్త ఓటర్ల జాబితాల మ్యాపింగ్ ప్రక్రియ శుక్రవారం నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సత్తిబాబు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం

విజయనగరం టౌన్: నూతన కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డిని బాబామెట్టలోని ప్రముఖ సూఫీ క్షేత్రం హజరత్ బాబా సయ్యద్ ఖాదర్ షా వలీ దర్గా ప్రతినిధి డాక్టర్ మహ్మద్ ఖలీల్ బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సత్కరించారు. త్వరలో జరగనున్న ఖాదర్ బాబా జయంతికి రావాలని ఆహ్వానించారు. అదేవిధంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తికి కూడా ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

మన ఊరు బాగుచేసుకుందాం

- కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి పిలుపు
- స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ప్రారంభం
- 12 మంది పారిశుధ్య కార్మికులకు సత్కారం



పారిశుధ్య కార్మికులను సత్కరించి ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

విజయనగరం: రోజుకో గంట కేటాయించడం ద్వారా మన ఊరును బాగుచేసుకుందామని కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో గురువారం ఉదయం ఆయన ప్రారంభించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ విజయనగరం సాధించేందుకు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 12 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కలెక్టరేట్‌ను 9 విభాగాలుగా విభజించి, వివిధ ప్రభుత్వ శాఖలకు అప్పగించడం ద్వారా పారిశుధ్య కార్యక్రమం నిర్వహించి శుభ్రం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఏక్ దిన్, ఏక్ గంటా, ఏక్ సాత్ నినాదంతో ముందడుగు వేయాలని కోరారు. కనీసం రోజుకో గంటపాటైనా సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి కావాలని సూచించారు. మన ఇంటితోపాటు పరిసరాల పరిశుభ్రత కూడా ఎంతో ముఖ్యమన్నారు. దీనివల్ల పరిసరాలు శుభ్రంగా ఉండడంతో పాటు, పర్యావరణ పరిరక్షణ, వివిధ రకాల వ్యాధుల నివారణకు దోహదపడుతుందని సూచించారు. అందువల్ల ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మన ఊరు బాగుండాలంటే అందుకు మనమే ముందుడుగు వేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిరోజు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నట్లు చెప్పారు. అయినప్పటికీ కొంతమంది చెత్తను పారిశుధ్య కార్మికులకు ఇవ్వకుండా, కాలువల్లోను, రోడ్ల పక్కన వేసేస్తున్నారన్నారు. ఈ అలవాటును మానుకోవాలని, కార్మికులు ఇంటివద్దకు వచ్చినప్పుడే చెత్తను అందజేయాలని సూచించారు. మన విజయనగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతిఒక్కరూ తమవంతు సహకారాన్ని అందజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, సీపీఓ పి.బాలాజీ, ఇతర అధికారులు, పలువురు నాయకులు, వివిధ శాఖల సిబ్బంది, మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


చీపురుపల్లి కలక్టరేట్ పరిసరాలను శుభ్రం చేస్తున్న కలెక్టర్, జేసీలు


కొత్తవలస చెరువు వద్ద శ్రమదానంలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డి

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

పార్వతీపురంటౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పరిసరాలు అందంగా కనిపించడంతో పాటు ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటామని కలెక్టర్ డా.ఎస్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రం చేయాలని కోరారు. తద్వారా మన పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణ పరిధిలోని 8వ వార్డులో గల కొత్తవలస చెరువు వద్ద స్వచ్ఛత హి సేవ -2025లో భాగంగా ఏక్ దిన్..ఏక్ గంట..ఏక్ సాత్ స్వచ్ఛత కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని శ్రమదానం చేయగా, మునిసిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, కమిషనర్ జి.శ్రీనివాసరాజు భాగస్వామ్యమై శ్రమదానం చేసి చెరువు పరిసరాలను పరిశుభ్రం చేశారు. పారిశుధ్య నిర్వహణ మనందరి బాధ్యతగా గుర్తెరగాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సహకరించాలి


పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ కె.హేమలత

- డీఆర్‌ఓ కె.హేమలత

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్‌ఓ కె.హేమలత కోరారు. ఈ మేరకు గురువారం ఆమె తన చాంబర్‌లో గుర్తింపు ఉన్న కొన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం ఓటర్ల నివాసాలకు 2కి.మీ పరిధిలో, 800 నుంచి 1200మంది ఓటర్లు ఉండేలా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు ఎక్కడైనా మార్పులు, చేర్పులు అవసరమని గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని పార్టీల ప్రతినిధులకు ఆమె సూచించారు. అదేవిధంగా పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీలో పార్టీల ప్రతినిధుల భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్‌లెవెల్ ఏజెంట్‌ను నియమించాలని వారు బూత్‌లెవెల్ అధికారులతో కలిసి పనిచేసి ఓటరు జాబితాలోని తప్పులు సరిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వెబ్ ల్యాండ్‌లో తప్పులు సరిచేయాలి

- రెవెన్యూ అధికారులను ఆదేశించిన జేసీ


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

పార్వతీపురంటౌన్: జిల్లాలో రెవెన్యూ శాఖకు చెందిన సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి రెవెన్యూ, రీసర్వే, వెబ్ ల్యాండ్ కేసులపై సంబంధిత అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. మానవీయకోణంలో పరిష్కరించేందుకు కృషిచేయాలని చెప్పారు. రికార్డుల మేరకు సమస్యల పరిష్కారం ఉండాలని, పరిష్కారం కాని వాటిపై అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. రీ సర్వే పక్కాగా ఉండాలని తేల్చిచెప్పారు. వెబ్ ల్యాండ్‌లో ఉన్న తప్పులు సరిచేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను జేసీ ఆదేశించారు. ఇప్పటికే పార్వతీపురంలో జరిగిందని, పాలకొండలో కూడా నిర్వహించాలని జేసీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తికి గాయాలు



గంట్యాడ: మండలంలోని బుడతనాపల్లి గ్రామానికి చెందిన పంకుంతల తులసి అనే వ్యక్తి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా గొడియాడ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు మెరుగైన చికిత్స కోసం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

నేరగాళ్లపై ఉక్కుపాదం మోపండి

- గంజాయి వ్యాపారస్తుల ఆస్తులు అటాచ్ చేయాలి
- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలో నేరాల నియంత్రణపై దృష్టిసారిస్తూ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని, అలాగే గంజాయి వ్యాపారంతో ఆస్తులు కూడబెట్టే వారిని గుర్తించి వారి ఆస్తులను అటాచ్ చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్పీ మాధవ్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లా పోలీసు అధికారులతో తన కార్యాలయం నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన మాసాంతపు నేరసమీక్ష సమావేశంలో పలు కీలక ఆదేశాలు జారీచేశారు. తరచూ నేరాలకు పాల్పడేవారిపై హిస్టరీ షీట్లు తెరిచి, వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో తప్పనిసరిగా ప్రతిరోజూ డ్రోన్ పోలీసింగ్ నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న హత్య, ఆస్తి, మహిళలపై నేరాల కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కఠినంగా వ్యవహించాలని సూచించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా కేసులపై ప్రత్యేక దృష్టిసారించి సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను ఛేదించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా. వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని పోలీసు అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సోషల్‌మీడియా, సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ అప్పారావు, ఎస్బీ సీఐ రమేష్‌తో పాటు మరికొంతమంది అధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలుశిక్ష


మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ, సీఐ, ఎస్సై సిబ్బందితో ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: మహిళా పోలీస్ స్టేషన్‌లో ఈ ఏడాది ఏప్రిల్‌లో నమోదైన పోక్సో కేసులో ముద్దాయి విజయనగరంలోని రాజీవ్ స్టేడియం, మేదరవీధికి చెందిన గ్రంధి పైడిరాజు అలియాస్ రాజు (38)కు విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.3,000 జరిమానా విధించడంతో పాటు, బాధితురాలికి పరిహారంగా రూ.2 లక్షలను మంజూరు చేయాలని గురువారం తీర్పు వెల్లడించారు. ఈ మేరకు ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఈ కేసు వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని మేదరవీధికి చెందిన గ్రంధి పైడిరాజు ఓ బాలికను ఏప్రిల్ నాలుగవ తేదీన స్కూటీపై వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆపై బాలికను చికిత్స నిమిత్తం స్థానిక ఘోషా ఆస్పత్రిలో తల్లి చేర్పించి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో జడ్జి పై విధంగా తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసుల తరఫున పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెట్ట ఖజానారావు వాదనలు వినిపించారు. కేసులో క్రియాశీలకంగా పనిచేసిన ఎస్సై కేవీ నరసింహారావు, హెచ్‌సీలు సీహెచ్.రామకృష్ణ, కేవీ నాయుడు, కానిస్టేబుల్స్ కె.గోవింద, జి.సూరపు నాయుడు, పి.రమేష్, కె.నాగమణిని ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాలు



సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరిగిన సౌత్‌జోన్ జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు గుంటూరు జిల్లాలోని ఆచార్యనాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో 8 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా,, ముగ్గురు క్రీడాకారులు నాలుగు పతకాలు దక్కించుకున్నారు. పోటీల్లో పి.వసంత 200 మీటర్ల పరుగు పోటీలో కాంస్య పతకం, 400 మీటర్ల రిలే పరుగు పోటీలో మరో కాంస్య పతకం కైవసం చేసుకుంది. అలాగే క్రీడాకారిణి దివ్య 400 మీటర్ల రిలే పరుగు పోటీలో కాంస్య పతకం దక్కించుకోగా.. ఎం.హరీష్ 3000 మీటర్ల పరుగు పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. సౌత్‌జోన్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు సతీష్, మధు, శేఖర్‌లకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.లీలాకృష్ణ, జి.శ్రీకాంత్, కోశాధికారి ఆనంద్ కిషోర్‌లు అభినందించారు.

ఉత్సాహంగా సైనిక్ స్కూల్ క్రీడా సంబరాలు


క్రీడాజ్యోతిని విద్యార్థికి అందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.ఎస్ శాస్త్రి


షాట్‌పుట్ పోటీల్లో పోటీ పడుతున్న క్రీడాకారులు

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక్ పాఠశాల వార్షిక క్రీడా సంబరాలు గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కోరుకొండ సైనిక్ పాఠశాల సైకోర్ స్పోర్ట్స్ మైదానంలో నిర్వహించిన 64వ వార్షిక అథ్లెటిక్స్ మీట్‌ను, పాఠశాల ప్రిన్సిపాల్ గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల్లో సైనిక పాఠశాలలోని శాతవాహన, చాళుక్య, గజపతి, గుప్తా, మొఘల్ హౌస్‌లకు చెందిన సీనియర్ విద్యార్థులు, అలాగే పాండ్య, మౌర్య, పల్లవ, కాకతీయ హౌస్‌లకు చెందిన జూనియర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక దృఢత్వానికి తోడ్పడతాయని, ప్రతి విద్యార్థి క్రీడాస్ఫూర్తి ప్రదర్శించి ఆడాలని సూచించారు.

ఏఓబీలో ఎక్సైజ్ దాడులు

- 730 లీటర్ల సారా, 9700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో స్వాధీనం చేసుకున్న బెల్లం ఊట నిల్వలు చూపుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

కురుపాం: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో ఇరు రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దాడుల్లో భారీగా సారా, సారా తయారీకి ఉంచిన బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సర్కిల్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మన్యం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.శ్రీనాథుడుడు, ఏఈఎస్ ఎ.సంతోష్‌ల ఆదేశాల మేరకు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలు సందుబడి, రంబళబలబాయ్, రేగుల పాడులలో దాడులు నిర్వహించగా సారా తయారీ కోసం నిల్వ ఉంచిన 9700 లీటర్ల బెల్లం ఊట, విక్రయానికి సిద్ధంగా ఉంచిన 730 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఒడిశా సరిహద్దు నుంచి సారా రవాణా చేస్తున్న వారి పేర్లు, పూర్తి సమాచారం తమ వద్ద ఉందని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిర్వాసితుల సమస్యపై ఎమ్మెల్యే మాట్లాడాలి



మూలబొడ్డవరలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించాలని, ప్రభుత్వానికి తమ గోడు వినిపించాలని, గురువారం నాటి నిరసన కార్యక్రమంలో నిర్వాసితులు డిమాండ్ చేశారు. జిందాల్ యాజమాన్యం అక్రమంగా తమ భూముల్లో ప్రవేశించి యేళ్ల వయస్సున్న చెట్లు కొట్టించిందని, అన్యాయంగా భూములు ఆక్రమించి, అక్రమ కేసులు పెట్టి బెదిరించారని, పోలీసుల నిర్బంధంలో నిర్వాసితులను ఉంచి, గొంతు నొక్కేశారని వాపోయారు. జిందాల్ గతంలో ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయకుండా, భూములు ఇచ్చిన రైతులను రోడ్డున నెట్టారన్న నిజాలను అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావించాలని నిర్వాసితులు కోరారు.

వరి పంటపై తెగుళ్ల దాడి

- నివారణకు అధిక మొత్తంలో ఖర్చు చేస్తున్న రైతులు
- ఎకరాకు రూ.800 నుంచి రూ.1000 వరకు ఖర్చు
- పట్టించుకోని వ్యవసాయ శాఖ


గంట్యాడ మండలం పెదవేమలిలో తెగులు సోకిన వరి పంట


పినవేమలిలో పొడ తెగులు సోకిన వరి పంట

విజయనగరం ఫోర్ట్:

అన్నదాతను కష్టాలు వీడడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సకాలంలో కురవక పోవడంతో ఆందోళన చెందారు. ఆలస్యంగా వర్షాలు కురవడంతో అష్టకష్టాలు పడి వరి పంట సాగు చేశారు. పంటకు ఎరువు వేద్దామంటే కూటమి సర్కార్ రైతులకు దొరకకుండా చేసింది. యూరియా కోసం అన్నదాతలు ఎన్నడూ లేనివిధంగా పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో యూరియా కోసం రైతుల తోపులాటలు, ధర్నాలు, నిరసనలు జరుగుతున్నాయి. కూటమి పాలనలో అన్నతాతకు అన్నీ కష్టాలే. తాజాగా వరి పంటను వివిధ రకాల తెగుళ్లు ఆశించాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎంతో కష్టపడి పంటను సాగు చేస్తే ఒకదాని తర్వాత మరో కష్టం వచ్చి పడుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

95 వేల హెక్టార్లలో వరి సాగు

జిల్లాలో వరి పంట 95 వేల హెక్టార్లలో సాగైంది. వరిపంటకు కొన్ని ప్రాంతాల్లో బాక్టీరియా తెగులు, మరి కొన్ని ప్రాంతాల్లో పొడ తెగులు ఆశించగా, కొన్ని ప్రాంతాల్లో ఆకుముడత తెగులు ఆశించింది. మరికొన్ని ప్రాంతాల్లో సుడిదోమ ఆశించింది.

వేలల్లో ఖర్చు చేస్తున్న రైతులు

వరిపంటకు ఆశించిన తెగుళ్ల నివారణకు రైతులు వేలల్లో ఖర్చు చేస్తున్నారు. వరిపంటకు రెండు, మూడు తెగుళ్లు ఆశించడంతో వాటిని నివారించేందుకు పురుగు మందుల కోసం రూ.800 నుంచి రూ.1000 వరకు ఖర్చు చేస్తున్నారు.

సూచనలు ఇచ్చే వారేరీ?

వరి పంటకు తెగుళ్లు, చీడపీడలు ఆశించిన నేపథ్యంలో వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే వారు కరువయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరి పంటకు ఆశించిన తెగులుకు ఏ పురుగు మందు పిచికారీ చేయాలో తెలియక రైతులు నేరుగా పురుగు మందుల డీలర్లను ఆశ్రయిస్తున్నారు. వారు ఇచ్చే మందులనే పంటకు పిచికారీ చేస్తున్నారు. దీని వల్ల సరైన మోతాదులో, సరైన మందు పిచికారీ చేయడం లేదనే విమర్శలు వ్యక్తమ వుతున్నాయి.

కానరాని వ్యవసాయ సిబ్బంది పర్యటనలు

రైతుల పొలాల్లో క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సిబ్బంది పర్యటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో పర్యటించినట్లయితే వరిపంటకు ఆశించే తెగుళ్లు, చీడపీడలను గుర్తించి అక్కడికక్కడే రైతులకు సూచనలు, సలహాలు, నివారణ చర్యల గురించి చెప్పడానికి అవకాశం ఉంటుంది. పొలం బడి కార్యక్రమం కూడా తూతూ మంత్రంగానే జరుగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ సిబ్బంది, అధికారులు కార్యాలయాలకే పరిమితమ వుతున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

యూరియా పంపిణీలో సిబ్బంది బిజీ


వరి పంటకు తెగుళ్ల ఆశించినట్లు గుర్తించాం. యూరియా పంపిణీలో ఇంతవరకు వ్యవసాయ సిబ్బంది బిజీగా ఉన్నారు. పొలంబడి కార్యక్రమాల్లో రైతులకు సూచనలు, సలహాలు అందించనున్నాం. రైతులు డీలర్ దగ్గరికి వెళ్లినప్పుడు వ్యవసాయ సిబ్బందికి ఫోన్ చేసి వారు చెప్పిన పురుగు మందులను మాత్రమే వినియోగించాలి. లైసెన్సులు లేకుండా నేరుగా గ్రామాలకు తెచ్చే డీలర్ల వద్ద పురుగు మందులు కొనుగోలు చేయవద్దు.

భారతి,
ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి

బాలికల భద్రతపై దృష్టి

విజయనగరం క్రైమ్: బాలికల భద్రతపై పోలీస్ శాఖ దృష్టి పెడుతోందని ఎస్పీ దామోదర్ తెలిపారు. గురువారం స్థానిక డీపీఓలో బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ గొట్టేటి హిమబిందు ఎస్పీ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలబాలికల రక్షణ, భద్రత, సంక్షేమం వంటి అంశాలపై ఎస్పీతో చర్చించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌వీఎస్ సూర్యానారాయణ కూడా పాల్గొని ఫ్యామిలీ కౌన్సెలింగ్, గృహహింస వంటి అంశాలపై ఎస్పీతో సమీక్షించారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన


విద్యార్థుల నృత్య ప్రదర్శన

విజయనగరం రూరల్: శరవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ పర్యాటక కేంద్రం రామనారాయణంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విశాఖపట్నానికి చెందిన సరస్వతీ నృత్య కళామందిర్ విద్యార్థులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.